పిలిస్తే పలికే దేవుడు పైరయ్యస్వామి

- నలదొడ్డి గ్రామ శివారులోని కొండల్లో వెలసిన ఆంజనేయస్వామి ఆలయం
- ఆలయానికి 700 ఏళ్ల చరిత్ర
- నేడు స్వామివారికి ప్రత్యేక పూజలు
- రేపు సీతారామలక్షణస్వామి సమేత ఆంజనేయస్వామి రథోత్సవం

పెద్దకడబూరు : పుణ్య స్థలాలకు పుట్టినిల్లు కర్నూలు జిల్లా. పవిత్రపుణ్య క్షేత్రం మంత్రాలయం శ్రీరాఘవేంద్రస్వామి ఆలయ సన్నిధికి అతిచేరువలో పెద్దకడబూరు మండలం బసలదొడ్డి గ్రామ శివారుల్లోని కొండకోనల్లో వెలసిన దైవం శ్రీపైరయ్య అంజనేయస్వామి పిలిస్తే పలికే దేవుడిగా ప్రసిద్ధి చెందారు. వందల ఏళ్ల చరిత్ర కలిగిన ఆలయంలో ఆదివారం స్వామివారి ప్రత్యేక పూజలు, సోమవారం రథోత్సవం నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా భక్తుల కోసం ఆలయ విశేషాలు..

స్వామివారికి పైరయ్య అని పేరు రావడానికి ఐదు కారణాలు ఉన్నాయని పెద్దలు చెబుతున్నారు. అవి...

- స్వామివారు పుట్టలో నుంచి పైకి రావడం
- గోవులు కొమ్ములతో పుట్టలో నుంచి పైకి తేవడం
- స్వామివారి చూపు పడమటి దిశకు ఉండడం


వేడుకలకు ముస్తాబైన పైరయ్యస్వామి ఆలయం


పూజలందుకుంటున్న పైరయ్యస్వామి

- బసలదొడ్డి గ్రామం కింద పక్క ఉండి ఆలయం పైపక్క ఉండడం
- చుట్టుపక్కల గ్రామాలలో పైర్లు, పంటలు బాగా పండడం వలన ఆయనను పైరయ్యగా పిలుస్తున్నట్లు చెబుతున్నారు.

ఆలయ చరిత్ర :

సుమారు 700సంవత్సరాల క్రితం దేవర గోవిందయ్య అను బాలుడు గోవులను కాస్తూ ఆ కొండల్లో తిరుగుతూ ఉండేవాడు. ఒకనాడు అతడు ఆవులను మేపుతుండగా ఒక గోవు తనకొమ్ములతో పుట్టను గెలుకగా (తవ్వగా) అందులో నుంచి అంజనేయస్వామి విగ్రహం బయటపడింది. వెంటనే దీనిని గమనించిన గోవిందయ్య తన స్వగ్రామం పశువులదొడ్డికి వెళ్లి విషయం తెలియజేయగా వారందరూ ఆశ్చర్యచకితులై.. స్వామివారికి ఆలయ నిర్మాణానికి పూనుకున్నారు. నిర్మాణం పూర్తికావచ్చిన దశలో స్వామివారి విగ్రహన్ని ప్రతిష్ఠించ దలిచారు. అయితే స్వామివారి దేవపలుకులతో అందరూ వింటుండగా ×వ్యాసాయా విష్ణురూపాయా వ్యాసరూపాయా విష్ణవే× కొద్ది కాలమునకు హనుమభక్తుడు తపోనిష్ఠుడైన శ్రీవ్యాసరాయుల వారు జన్మిస్తారు. వారిచే విగ్రహన్ని ప్రతిష్ఠింపజేయాలని తెలియజేసినట్లు నానుడి. ఈవిధంగా శ్రీకృష్ణదేవరాయుల కాలంలో రాజ గురువైన శ్రీవ్యాసరాయులచే గ్రామ ప్రజలు శ్రీపైరయ్య అంజనేయస్వామి విగ్రహన్ని ప్రతిష్ఠించి, ఆలయ నిర్మాణం పూర్తిచేసినట్లు ప్రతీతి. నమ్మిన భక్తులకు వారి కోరికలను తీరుస్తు ఎంతో మంది భక్తుల హృదయాలలో నెలకొని పూజలందుకుంటున్నారు.

బసలదొడ్డి గ్రామంపై స్వామి ఆశీస్సులు..

కాలక్రమేణ గ్రామప్రజలు భుజించిన మాంసహారాలు మరియు పశువుల కలేబరాలను పక్షులు ఆలయ ప్రాంగణంలో పడేసి అపరిశుభ్రతకు గురిచేసేవి. దీంతో ఆగ్రహం చెందిన పైరయ్యస్వామి ప్రజలనుద్దేశించి దైవ పలుకులతో ఈవిధంగా వివరించారు.. నేను ఒక కుందేలు రూపంలో జెమ్మిచెట్టు దగ్గర కుక్కలకు తిరుగబడి వాటిని తరుముతాను. అక్కడ మీ గ్రామ నిర్మించుకోండని తెలిపారు. ఈ విధంగా దేవాలయం దగ్గర ఉన్న పశువులదొడ్డి గ్రామము ఆలయానికి దూరంగా బసలదొడ్డి నామకరణంతో రూపాంతరం చెందింది. ఈ విధంగా వెలసిన శ్రీపైరయ్య ఆంజనేయస్వామి ప్రభావంతో గ్రామం దిన దినాభివృద్ధి చెందుతూ ప్రశాంతతకు నిలయంగా మారింది. ప్రజల కోరికలను తీరుస్తు పిలిస్తే పలికే దేవుడిగా పిలుచుకుంటూ స్వామివారు పూజలు అందుకోవడం జరుగుతుంది.

శ్రావణ శనివారాల్లో ప్రత్యేక పూజలు


ఆలయంలో శ్రావణమాస శనివారాల్లో గ్రామంతో పాటు చుట్టుపక్క ప్రాంతాల ప్రజలు భజనలతో వెళ్లి స్వామివారికి పూలతో అలంకరించడం ఆనవాయితీ. స్వామి కుడివైపు చేతిలో పూలు ఇస్తే ఆ ప్రాంతంలో వర్షాలు బాగాపడి పంటలు సమృద్ధిగా పండి ప్రజలు సుఖ సంతోషాలతో ఉంటారని నమ్మకం. ఆ చుట్టుపక్కల గ్రామ ప్రజలందరూ ఈయననూ కొలిస్తే పిల్లలు కాని వారికి పిల్లలు పుడుతారని, పెళ్లిల్లు కాని వారికి వివాహాలు అవుతాయని విశ్వాసం. ఈ ఆలయంలో పెళ్లిల్లు చేసుకున్న జంటలు సుఖ సంతోషాలతో, అష్ట అశ్వైర్యాలతో వెలుగుతారని ప్రజలు నమ్ముతారు. అదేవిధంగా కార్తీక మాసంలో బ్రాహ్మణులచేత సుమారుగా 9 రోజులు లక్ష తులసీ అర్చన చేస్తారు.

రేపు రథోత్సవం

ఆదివారం అమావాస్యను పురస్కరించుకొని హనుమా అలంకారములో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. సోమవారం పాడ్యమిరోజున భీమసేన వెండి అలంకారంలో ప్రత్యేక పూజలు నిర్వహించి సాయంత్రం శ్రీ సీతారామ లక్షణస్వామి వారితో కలిపి రథోత్సవం ఘనంగా నిర్వహిస్తారు. కార్యక్రమానికి ఆంధ్ర రాష్ట్ర ప్రజలతో పాటు కర్ణాటక, తెలంగాణ ప్రజలు అధిక సంఖ్యలో హాజరు అయ్యి మొక్కులు తీర్చుకుంటారు.

క్లుప్తంగా

ముగిసిన కార్తీక మాసోత్సవాలు



ఆదోని అర్బన్: పట్టణ శివారులోని శ్రీ రణమండల కొండలో వెలిసిన శ్రీ రణమండల ఆంజనేయస్వామి ఆలయంలో కార్తీకమాస ఉత్సవాలు శనివారంతో ముగిశాయి. కార్తీకమాస నిత్యప్రసాద సేవాసమితి ఆధ్వర్యంలో పూజారి ఆనంద ఆచారి స్వామి వారికి ఫల పంచామృతాభిషేకం, సింధూరసేవ తదితర పూజలు చేపట్టారు.

ఆదోని టౌన్: పట్టణంలోని ఎమ్మిగనూరు సర్కిల్‌లో వెలిసిన శ్రీ అభయాంజనేయస్వామి కార్తీకమాస ముగింపు వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. ఆలయ నిర్వాహకులు తిక్కస్వామి, వెంకటేశ్వర్లు, నాగేంద్ర, బజా రమ్మ, యోగేంద్ర భక్తులకు అన్నదానం చేపట్టారు.

అక్రమాలకు పాల్పడితే చర్యలు

కౌతాళం: డీలర్లు అక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవని తహసీల్దారు మల్లికార్జునస్వామి అన్నారు. శనివారం స్థానిక తహసీల్దారు కార్యాలయంలో మండల డీలర్ల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ డీలర్లు తూకాల్లో ఎలాంటి మోసాలు చేయకుడదని, అలాగే అక్రమంగా రేషన్ అమ్మిన వారిపై చర్యలు తీసుకోవడంతో పాటు డీలర్‌షిప్‌ను రద్దు చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో డిప్యూటీ తహసీల్దారు రజినికాంత్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం


మద్యం, నిందితుడితో ఎస్‌ఐ విజయ్‌కుమార్

మంత్రాలయం : అక్రమంగా కర్ణాటక మద్యాన్ని తరలిస్తున్న వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. మాధవరం పోలీస్ స్టేషన్ ఎస్‌ఐ విజయ్‌కుమార్ నేతృత్వంలో పోలీసులు శనివారం దాడులు చేపట్టారు. దాడుల్లో మండలంలోని కాచాపురం గ్రామానికి చెందిన రాఘవేంద్ర కర్ణాటక మద్యంతో పట్టుబట్టాడు. అతని వద్ద నుంచి 186 (90 ఎంఎల్) కర్ణాటక టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసి అరెస్టు చేశారు.

పీఆర్‌టీయూ కార్యవర్గం ఎన్నిక

ఎమ్మిగనూరుటౌన్: మండల పీఆర్‌టీయూ నూతన కార్యవర్గాన్ని శనివారం ఎన్నుకున్నారు. మండల కార్యవర్గ గౌరవ అధ్యక్షుడిగా ఈశ్వర్‌రెడ్డి, అధ్యక్షుడిగా నరసింహుడు, ప్రధాన కార్యదర్శిగా సుధీర్‌బాబు, అసోసియేట్ అధ్యక్షుడిగా మల్లికార్జున, ఉపాధ్యక్షుడిగా శ్రీనివాసులు శెట్టి, మహిళా అధ్యక్షురాలిగా యు.లక్ష్మి తదితరులు ఎన్నికయ్యారు.

పింఛన్ల పంపిణీ


పింఛన్లు పంపిణీ చేస్తున్న కమిషనర్

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని గీతానగర్‌లో శనివారం ఉదయం మున్సిపల్ కమిషనర్ లబ్ధిదారులకు పింఛన్లను పంపిణీ చేశారు. అనంతరం ఆ ప్రాంతంలో మంచినీటి సరఫరాను పరిశీలించారు. కార్యక్రమంలో వార్డు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అర్హత కలిగిన వారికే సదరం సర్టిఫికెట్

కోసిగి: అర్హత ఆధారంగానే వైకల్యం పర్సంటేజ్‌తో సదరం సర్టిఫికెట్స్ జారీ చేస్తున్నట్లు ఆర్థోపెడిషియన్ డాక్టర్ మల్లికార్జున తెలిపారు. శనివారం స్థానిక ప్రభుత్వ హాస్పిటల్‌లో మానసిక వికలాంగులు, దివ్యాంగులకు సదరం క్యాంపు నిర్వహించారు. కొందరికి పరీక్షలు చేయగా, మరిందరికి స్కానింగ్ టెస్ట్ కోసం ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి పంపించారు.

పార్కును వినియోగంలోకి తీసుకురావాలి

నందవరం : మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన పార్కును వినియోగంలోకి తీసుకురావాలిని ఎంపీడీఓ పుల్లయ్య సూచించారు. శనివారం గ్రామంలోని కొత్త బీసీ కాలనీ ఏర్పాటు చేసిన పార్కును పరిశీలించారు. పిచ్చి మొక్కలను తొలగించి ఉపాధి పనుల్లో భాగంగా మొక్కలు నాటాలన్నారు. కార్యక్రమంలో ఏపీఓ శ్రీనివాసులు, పంచాయతీ కార్యదర్శి విజయలక్ష్మి పాల్గొన్నారు.

కనుల పండువగా మధ్యారాధన


బృందావనానికి పుష్పార్చన చేస్తున్న పీఠాధిపతి

మంత్రాలయం: మధ్వ మత సంస్థాన పూర్వ పు పీఠాధిపతి పద్మనాభ తీర్థుల ఆరాధన వేడుకలు రెండవ రోజు కనుల పండువగా జరిగాయి. కర్ణాటకలోని గంగావతి తాలూకా ఆనెగుంది నవబృందావన క్షేత్రంలో పద్మనాభ తీర్థుల మధ్యారాధన వేడుకలు శ్రీమఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా నిర్వహించారు.

చట్టాలపై అవగాహన ఉండాలి


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న చిల్డ్రన్స్ వెల్ఫేర్ కమిటీ సభ్యులు వెంకట రమణయ్య

ఆదోని సెంట్రల్: ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని చిల్డ్రన్స్ వెల్ఫేర్ కమిటీ సభ్యులు వెంకటమణయ్య తెలిపారు. శనివారం ఆదోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో పోక్సో చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ మురళీమోహన్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. చట్టాలపై సరైన అవగాహన లేక చాల మంది ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. చెడు వ్యసనాలకు, చెడు అలవాట్లు, చెడు సహవాసాలకు దూరంగా ఉండాలన్నారు. లైంగిక నేరాలు, బాలికల సంరక్షణ, మానవ అక్రమ రవాణ, మత్తుపదార్థాల(డ్రగ్స్)నిషేధ చట్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం అర్‌యూసేఫ్ వన్ పోస్టర్‌ను విడుదల చేశారు. కార్యక్రమంలో ఎస్ఎస్ఎస్ అధికారులు జోనాథన్, రాజు, మెఘనాథ్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

హెచ్ఐవీపై అవగాహన అవసరం


జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న డీఎస్పీ, మున్సిపల్ కమిషనర్

ఎమ్మిగనూరుటౌన్: హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై ప్రతి ఒక్కరికి అవగాహన వుండాలని డీఎస్పీ ఉపేంద్ర బాబు, మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి సూచించారు. శనివారం పట్టణంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల వద్ద విజయ మహిళా మండలి ఆధ్వర్యంలో చేపట్టిన ఎయిడ్స్‌పై అవగాహన ర్యాలీని వారు ప్రారంభించారు. వారు మాట్లాడారు. హెచ్ఐవీ సోకిన వారికి ప్రభుత్వం ఉచితంగా మందులు పంపిణీ చేస్తుందన్నారు. ఈ వ్యాధి సోకిన వారిని బహిష్కరించ కూడదని, వారి పట్ల మానవత్వంతో వ్యవహరించాలని సూచించారు. కార్యక్రమంలో పట్టణ సీఐ శ్రీనివాసులు, కళాశాల ప్రిన్సిపాల్ విజయరాణి, విజయ మహిళా మండలి డైరెక్టర్ వేణుగోపాలాచారి, ఎస్ఐ డాక్టర్ నాయక్, ప్రాజెక్ట్ మేనేజర్లు పాల్గొన్నారు.

సైబర్ నేరగాళ్ల పట్ల అప్రమత్తత అవసరం

సైబర్ నేరగాళ్ల పట్ల అప్రమత్తత అవసరమని పట్టణ సీఐ శ్రీనివాసులు సూచించారు. శనివారం పట్టణంలో సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. సీఐ మాట్లాడుతూ మొబైల్‌కు వచ్చే ఓటీపీలు ఎవరికి తెలియజేయకూడదని సూచించారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి


కరపత్రాలు విడుదల చేస్తున్న సీఐ గంగాధర్

గోనెగండ్ల : సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, తెలియని వ్యక్తులకు వ్యక్తి గత వివరాలు చెప్పి మోసపోవద్దని సీఐ గంగాధర్ సూచించారు. శనివారం మండల కేంద్రం గోనెగండ్లలోని వైఎస్సార్ సర్కిల్‌లో సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించి, పోస్టర్లు, కరపత్రాలను విడుదల చేశారు. సీఐ మాట్లాడుతూ సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడి నష్టపోతున్న వారి సంఖ్య రోజు రోజుకు పెరుగుతుందన్నారు. వ్యక్తి గత వివరాలను అపరిచితుల వ్యక్తులతో పంచుకోవద్దని సూచించారు. మీకు లోన్ వచ్చింది మీకు వచ్చిన లింక్‌పై క్లిక్ చేస్తే సరిపోతుందని చెప్పి మోసం చేస్తున్నారని హెచ్చరించారు. అనంతరం ప్రజలకు కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పోలీసులు దేవరాజు, రవి కుమార్, ఖాజాపటేల్, రాజు తదితరులు పాల్గొన్నారు.

కౌతాళం: పౌరహక్కుల దినోత్సవం సందర్భంగా మండల పరిధిలోని బాపువరం గ్రామంలోతహసీల్దారు మల్లికార్జునస్వామి, సీఐ అశోక్‌కుమార్ ప్రజలకు చట్టాలపై అవగాహన కల్పించారు.

మంత్రాలయం : మాధవరం గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద ఎస్ఐ విజయ్‌కుమార్ సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. పోస్టర్లు విడుదల చేశారు.

పెద్దకడబూరు :స్థానిక సచివాలయంలో ఎస్ఐ నిరంజన్‌రెడ్డి ఆధ్వర్యంలో పౌరులకు ఉన్నటువంటి హక్కుల గురించి వివరించారు.

అంకిత భావంతో పనిచేస్తే ప్రజల మన్ననలు


రిటైర్డ్ అధ్యాపకుడు ప్రభుదాస్‌ను సన్మానిస్తున్న డీఈఓ శామ్యూల్ పాల్

ఎమ్మిగనూరురూరల్: ఉపాధ్యాయుడు అంకిత భావంతో పనిచేస్తే ప్రజల మన్ననలు పొందుతారని జిల్లా విద్యాధికారి శామ్యూల్‌పాల్ అన్నారు. శనివారం మండల పరిధిలోని దైవందిన్నె గ్రామంలో జిల్లా పరిషత్ హైస్కూల్లో ఇంగ్లిష్ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న ప్రభుదాస్ పదవీ విరమణ కార్యక్రమానికి డీఈఓ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రభుదాస్ దంపతులను శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఆయన మాట్లాడుతూ పాఠశాలలో పనిచేస్తూ, విద్యార్థుల మధ్య ఉండి పదవీ విరమణ చేస్తున్నారంటే బాధగానే ఉంటుందని చెప్పారు. అయితే ప్రభుత్వ ఉద్యోగికి బదిలీలు, పదవీ విరమణలు సర్వసాధారణమన్నారు. అనంతరం ప్రభుదాస్‌ను తోటి ఉపాధ్యాయ బృందం, బంధువులు, స్నేహితులు, గ్రామస్తులు సత్కరించారు. కార్యక్రమంలో ఎంఈఓ మధుసూదన్, హెచ్ఎం దాదాబాషా, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఎల్లెల్సీకి నీటి సరఫరాను నిలిపివేయొద్దు



తహసీల్దారుకు వినతిపత్రం అందజేస్తున్న రైతులు

కౌతాళం: తుంగభద్ర దిగువ కాలువకు నీటి సరఫరా బంద్‌చేసి కామవరం హెడ్ రెగ్యూలేటర్ వద్ద ఎస్కేప్ ఛానల్ తూము గేటు మరమ్మతులు చేయడానికి అధికారులు నిర్ణయం తీసుకోవడంతో రైతులు ఆందోళనకు దిగారు. తూము మరమ్మతులకు డిసెంబర్ 1 నుంచి 20రోజుల పాటు నీటి పరఫరాను బంద్ చేయాలని అధికారులు నిర్ణయించారు. విషయం తెలుసుకున్న మండలంలోని వివిధ గ్రామాలతో పాటు కౌతాళం రైతులు శనివారం స్థానిక తహసీల్దారు కార్యాలయం వద్ద ఆందోళనకు దిగారు. నీరు బంద్ చేయకుడదని, నీరు బంద్ చేస్తే తమకు ఆత్మహత్యలే శరణ్యమవుతాయని, నీటి సరఫరాను యథావిధిగా కొనసాగించాలని తహసీల్దారు మల్లికార్జునస్వామికి వినతిపత్రం అందజేశారు. కౌతాళం సర్పంచ్ పాల్‌దినకర్, ఉప్పరహాల్ సర్పంచ్ తులసీ, రైతులు మాట్లాడుతూ.. సాగునీరు మార్చి వరకు వస్తాయని తెలుపడంతో రబీ సీజన్‌లో పంటలను సాగుచేసుకోవడానికి సిద్ధం అవుతున్న తరుణంలో నీరు బంద్‌చేస్తే తమ పరిస్థితి ఎలా అని ఆందోళనం వ్యక్తం చేశారు. ప్రభుత్వం మండలాన్ని కరువు మండలంగా ప్రకటించిందని.. అయినా ప్రభుత్వం, అధికారులు ఎలాంటి ఆలోచన లేకుండా ఎస్కేప్ తూము మరమ్మతులు పేరిటా 20రోజులు కాలువ బంద్ చేయాలని నిర్ణయించడం దారుణన్నారు. కార్యక్రమంలో రైతులు జెట్టప్ప, ఉసేని, ఈరన్న, ఏకాంబర్ రెడ్డి, కౌతాళం, బదినేహాల్, కుంటనహాల్, ఉప్పరహాల్, కామవరం, ఎరిగేరి రైతులు పాల్గొన్నారు.

మున్సిపల్ కౌన్సిల్‌లో కుర్చీల గోల

- వైస్ చైర్మన్లకు ప్రత్యేక కుర్చీలు కేటాయించకపోవడంతో చైర్‌పర్సన్‌ను నిలదీసిన కౌన్సిలర్లు
- పోడియం వద్ద కూర్చొని నిరసన
- వైఎస్సార్‌సీపీ, బీజేపీ కౌన్సిలర్ల మధ్య వాగ్వాదం
- వాయిదా పడిన కౌన్సిల్ సమావేశం


చైర్‌పర్సన్ పోడియం ముందు బైఠాయించిన పాలకవర్గ సభ్యులు

ఆదోని టౌన్: ఆదోని మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో వైస్ చైర్మన్‌లకు కుర్చీలను ప్రత్యేకంగా కేటాయించకపోవడంపై వైస్ చైర్మన్‌లు నరసింహులు, అబ్దుల్‌గౌస్‌తో పాటు కౌన్సిలర్లు సందీప్‌రెడ్డి, రాజేశ్వర్‌రెడ్డి, అశోక్, చలపతి, ఫయాజ్‌అహ్మద్, సుశీల.. చైర్‌పర్సన్ బోయశాంతను ప్రశ్నించారు. చైర్‌పర్సన్ పోడియం వద్దకు చేరుకుని నిరసన తెలియజేశారు. పోడియం వద్దనే నేలపై కూర్చొని సమావేశాన్ని కొనసాగించాలని పట్టుబట్టారు. కౌన్సిల్‌లో వైస్ చైర్మన్‌లకు ప్రత్యేకంగా కుర్చీలను ఏర్పాటు చేయరాదని నిబంధనలు ఉన్నాయా, ఒకవేళ ఉంటే వాటిని తమకు చూపించాలని కౌన్సిలర్లు చైర్‌పర్సన్, మున్సిపల్ కమిషనర్‌ను కోరారు. అనంతరం నిరసనల మధ్యనే సమావేశం ప్రారంభంకాగా.. ప్రజా సమస్యలపై వైఎస్సార్‌సీపీ, బీజేపీ కౌన్సిలర్ల మధ్య వాగ్వాదం జరిగింది. కాగా, కౌన్సిల్ అజెండాలో 70 అంశాలు ఉండగా, చర్చించేందుకు సమయం చాలదంటూ 17 అంశాలపైనే చర్చించి, మరో రోజుకు కౌన్సిల్‌ను వాయిదా వేయాలని వైస్ చైర్మన్, కౌన్సిలర్లు చైర్‌పర్సన్‌ను కోరారు. దీంతో చైర్‌పర్సన్ కౌన్సిల్ సమావేశాన్ని వాయిదా వేశారు.

సమస్యలపై నిలదీత

వ్యాపారుల గుడ్‌విల్‌తో నిర్మిస్తున్న మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్ పనులను వెంటనే ప్రారంభించాలని తద్వారా మున్సిపాలిటీకి నెలకు రూ.60 లక్షల నుంచి రూ.70 లక్షల వరకు ఆదాయం వస్తుందని, ఆదాయాన్ని రాబట్టడంలో ఎందుకు నిర్లక్ష్యం వహిస్తున్నారని పాలకవర్గ సభ్యులు సందీప్‌రెడ్డి, ఫయాజ్, అశోక్, చలపతి అధికారులను ప్రశ్నించారు. మున్సిపాలిటీకి ఆదాయ వనరులు పెంచుకోవడంలో విఫలమవుతున్నామని విమర్శించారు.

- పట్టణంలో కుక్కల పట్టివేతకు దాదాపు రూ.12 లక్షలు మేర ఖర్చు చేశారని, అయితే ఏ వీధిలో చూసినా కుక్కలు గుంగపు గుంపులుగా ఉన్నాయని వైస్ చైర్మన్ నరసింహులు అధికారుల దృష్టికి తీసుకొచ్చారు.
- వెంకన్నబావిలో నీటిని బయటకు తోడేసి, ఊట నీటిని ప్రజావినియోగంలోకి తీసుకొస్తామని చెప్పి, లక్షలాది రూపాయలు ఖర్చు చేశారే తప్పా ఉపయోగం లేకుండా పోయిందని వైస్ చైర్మన్ నరసింములు, కౌన్సిలర్లు ఫయాజ్, సందీప్‌రెడ్డి, చలపతి అధికారులను నిలదీశారు. మున్సిపాలిటీలో తడిపొడి చెత్తను స్వీకరించేందుకు ఏర్పాటు చేసిన ఆటోలు షెడ్‌కు ఆగిపోయాయని, వాటి ద్వారా నిరుద్యోగులు ఉపాధిని కోల్పోయి అప్పుల పాలయ్యారని కౌన్సిలర్లు అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. ఆటోలను రోడ్లపైకి నడుపుతూ తడిపొడి చెత్తను సేకరించేలా చూడాలని కోరారు.

చైర్‌పర్సన్‌కు వ్యాపారుల వినతి

పట్టణంలోని పాత బస్టాండు సర్కిల్‌లో వ్యాపారుల గుడ్ విల్‌తో నిర్మిస్తున్న మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం పనులు ఆగిపోయాయని, వెంటనే పనులను ప్రారంభించి తమకు షాపులను అప్పగించాలని కోరుతూ వ్యాపారులు నాగేష్, ఫయాజ్‌ఖాన్

పేదల పక్షాన పోరాటం

ఎమ్మిగనూరుటౌన్: పేదల పక్షాన ప్రభుత్వాలతో సమస్యలపై పోరాటాలు చేయాలని భారత రైతు కూలీ సంఘం రాష్ట్ర కార్యదర్శి ప్రసాద్, జిల్లా కార్యదర్శి ఏసేపు, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర, జిల్లా కార్యదర్శులు నర్సన్న, హనీఫ్ పిలుపునిచ్చారు. అమర వీరుల స్మారక సభల్లో సభల్లో భాగంగా శనివారం ఆయా సంఘాల నాయకులు రామన్న గౌడ్, హనుమంతు, జేమ్స్, ఉరుకుందప్ప స్మారక స్థూపాల వద్ద వారు నివాళులర్పించారు. నాయకులు భారతమ్మ, లక్ష్మన్న, దావీదు తదితరులు పాల్గొన్నారు.

సాగు, తాగునీరు అందించే వరకు పోరాటాలు

ఆదోని రూరల్: మండలంలోని రైతులకు సాగు, తాగునీరు అందించేందుకుం పోరాటాలు చేస్తామని సీపీఎం జిల్లా కార్యదర్శి గౌస్‌దేశాయ్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు రామాంజనేయులు, వెంకటేశులు అన్నారు. శనివారం మండలంలోని గణేకల్ గ్రామంలో ఆదోని మండలం 8వ మహాసభలను బి.వీరారెడ్డి, ఎం.ఉచ్చీరప్ప అధ్యక్షతన జరిగాయి. ఈసందర్భంగా పార్టీ మండల నూతన కమిటీని 13 మందితో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు


గోనెగండ్లలో మలుపులను పరిశీలిస్తున్న అధికారులు

గోనెగండ్ల : రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటున్నట్లు మోటర్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ కె.సిసిర దీప్తి, కోడుమూరు ఆర్‌అండ్‌బీ డీఈ రవిచంద్ర, గోనెగండ్ల సీఐ గంగాధర్ అన్నారు. శనివారం వారు మండలంలోని ఎమ్మిగనూరు, కోడుమూరు, పత్తికొండ, కోడుమూరు స్టేట్ హైవే రోడ్డులను పరిశీలించారు. ఆ రహదారుల్లో ఉన్న ప్రమాదకర ప్రదేశాలు, మలుపులను గుర్తించారు. వారు మాట్లాడుతూ ఎమ్మిగనూరు, కోడుమూరు, పత్తికొండ రహదారుల్లో నిత్యం ప్రమాదాలు జరుగే ప్రదేశాలు, మలుపుల దగ్గర సూచికల బోర్డులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అలాగే రోడ్డు పక్కన ఉన్న ముళ్ల పొదలను గుర్తించామన్నారు. వాహనదారులు అతీవేగంగా వెళ్లి ప్రమాదాలకు గురై ప్రాణాలను పోగొట్టుకుంటున్నారని చెప్పారు. వాహనదారులు నిబంధనలు పాటిస్తే ఎటువంటి రోడ్డు ప్రమాదాలు జరగవని తెలిపారు.

జీనియస్ గ్లోబల్ స్కూల్‌ను సీజ్ చేయాలి

ప్రభుత్వ నిబంధనలు తుంగలో తొక్కి నిర్వహిస్తున్న జీనియస్ గ్లోబల్ స్కూల్‌ను సీజ్ చేయాలని ఆయా విద్యార్థి సంఘాల నాయకులు కృష్ణ, రాఘునాథ్, ఖాజా ఆఫ్రిది, నాగరాజు కోరారు. ఈ మేరకు శనివారం ఆర్టీఓ సిసిర దీప్తి, ఎంఈఓ రామాంజినేయులు వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ.. కండిషన్ లేని వాహనాలు టాటా ఏసీ, జీపులను నడుపుతూ విద్యార్థుల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారన్నారు. అలాగే స్కూల్‌లో 500 మంది విద్యార్థులకు మాత్రమే కెపాసిటీ ఉండగా 750 మంది విద్యార్థులను ఉంచి విద్యను వ్యాపారంగా చేస్తు డబ్బులు వసూలు చేసుకుంటున్నారన్నారు.

ఇంటింటికీ పింఛన్.. నామమాత్రమే


సాతనూరు సచివాలయం వద్ద పింఛన్ల కోసం వేచి ఉన్న వృద్ధులు

కోసిగి: గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగులు ఇంటింటికి వెళ్లి పింఛన్ సొమ్ము అందజేస్తున్నారని కూటమి ప్రభుత్వం చెబుకుంటున్నా .. ఆచరణలో నామమాత్రానికే పరిమితమవుతోంది. డిసెంబర్ నెలకు సంబధించిన పింఛన్ల పంపిణీని శనివారం సచివాలయ ఉద్యోగస్తులచే చేపట్టారు. కోసిగి మండలంలో వృద్ధులు, వికలాంగులు, వింతువుల పింఛన్లు 7,223 మందికి రూ.3.10,83,500 నగదు మంజూరైంది. మండలంలోని 19 సచివాలయాలు ఉన్నాయి. ఇందుకు గానూ 220 మంది సచివాలయ ఉద్యోగస్తులు పనిచేయాల్సి ఉండగా.. గతేడాది బదిలీలో భాగంగా సగానికి పైగా ఉద్యోగులు వెళ్లి పోగా ప్రస్తుతం 92 మంది మాత్రమే పనిచేస్తున్నారు. దీంతో ఇద్దరేసి ఉద్యోగులు పింఛన్ల పంపిణీ చేపట్టాల్సి ఉండగా.. ఒక్కొక్కరు మాత్రమే చేయాల్సి రావడంతో సచివాలయ ఉద్యోగులు అష్టకష్టాలు పడుతున్నారు. వారు కాలనీలోని ఇంటింటికీ తిరగలేక ఏదో ఒక ప్రాంతంలోనే కూర్చుని పంపిణీ చేపడుతున్నారు. అలాగే సర్వర్ సమస్యతో బయోమెట్రిక్ నెమ్మదిగా సాగుతోంది. దీంతో పింఛన్‌దారులు పడిగాపులు కాస్తూ అవస్థలు పడుతున్నారు. మండలంలోని కోసిగి, చింతకుంట, సాతనూరు, అగసనూరు, కందుకూరు, ఆర్లబండ, వందగల్లు, జుమ్మాలదిన్నె, సజ్జలగుడ్డం, జంపాపురం తదితర గ్రామాల్లో రచ్చబండ వద్ద పింఛన్ల పంపిణీ కొనసాగింది. శనివారం ఉదయం నుంచి సాయంత్రం వద్ద 92 శాతం పింఛన్లు పంపిణీ చేసినట్లు ఎంపీడీఓ వెంకటేశ్వర్లు తెలిపారు. సిబ్బంది కొరత, సర్వర్ సమస్య కారణంగా పంపిణీ నిదానంగా సాగుతోందని చెప్పారు.

కమనీయం.. కల్యాణం


కల్యాణ మహోత్సవం నిర్వహిస్తున్న భక్తులు

ఆదోని సెంట్రల్: పట్టణంలోని తిరుమలనగర్ శంకర మఠం కళ్యాణ మండపంలో అంబికా చంద్రమౌళేశ్వర కళ్యాణ మహోత్సవం శనివారం అంగరంగ వైభవంగా జరిగింది. వందలాది మంది భక్తుల నడుమ భారతి తీర్థ ఉద్యానవనంలో స్వామి వారి ఎదురుకోళ్ల మహోత్సవాన్ని నిర్వహించారు. కళ్యాణ మహోత్సవం నిర్వాహకులు ఆలయ దర్మకర్త డా. కృష్ణదేవరాయులు, కాలనీ పెద్దలు రఘురామయ్య, కృష్ణమూర్తి గౌడ్, హనుమంతరావు, శివరాం రెడ్డి, సేదిందర్ రావు, డా. గోవిందరాజులు, గోపాల స్వామి, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.